# జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

- ఆలిండియా టాపర్‌గా నిలిచిన ఢిల్లీ జోన్ విద్యార్థి రజిత్‌గుప్తా
- ఆలిండియా మహిళా టాపర్‌గా ఖరగ్‌పూర్ జోన్ విద్యార్థి దేవదత్త మాఝి
- టాప్-10లో సత్తాచాటిన ఇద్దరు తెలుగు విద్యార్థులు
- అడ్వాన్స్‌డ్ ఈడబ్ల్యూఎస్ టాపర్‌గా అజయ్‌రెడ్డి
- ఓబీసీ ఎన్‌సీఎల్ టాపర్‌గా డీ జ్ఞాన రుత్విక్‌సాయి
- ఆలిండియా 9,10 ర్యాంకులు సాధించిన అర్నవ్‌సింగ్, లోకేశ్

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ఐఐటీ ఎంట్రన్స్ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులు సత్తాచాటారు. క్యాటగిరీ వారి ర్యాంకుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులిద్దరు టాపర్లుగా నిలిచి.. మరోసారి తెలుగు రాష్ట్రాల ఖ్యాతిని పెంచారు. ఈడబ్ల్యూఎస్ ఆలిండియా టాపర్‌గా వంగాల అజయ్‌రెడ్డి, ఓబీసీ ఎన్‌సీఎల్ ఆలిండియా టాపర్‌గా డీ జ్ఞానరుత్విక్ సాయిలు నిలిచారు. ఐఐటీల్లోని బీటెక్ కోర్సుల్లో సీట్ల భర్తీకి మే18న నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల ఫలితాలను సోమవారం ఐఐటీ కాన్పూర్ విడుదల చేసింది. మొత్తం 360మార్కులకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్ష నిర్వహించారు. ఈ ఫలితాల్లో ఐఐటీ ఢిల్లీ జోన్ విద్యార్థి రజిత్ గుప్తా మొత్తం 360 మార్కులకు గానూ 332 మార్కులు సాధించి, కామన్ ర్యాంక్ లిస్ట్ (సీఆర్‌ఎల్)లో టాప్ ర్యాంకర్‌గా నిలిచాడు. ఐఐటీ ఖరగ్‌పూర్ జోన్‌కు చెందిన దేవదత్త మాఝీకి 312 మార్కులు రాగా, సీఆర్‌ఎల్‌లో 16వ ర్యాంక్ లభించింది. 116మంది విదేశీ విద్యార్థులు ఈ పరీక్ష రాయగా, వీరిలో 13మంది క్వాలిఫై అయ్యారు. అదేవిధంగా ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థి అర్నవ్ సింగ్ 319మార్కులతో ఆలిండియా 9వ ర్యాంకుతోపాటు, హైదరాబాద్ జోన్ టాపర్‌గా నిలిచాడు. అలాగే వడ్లమూడి లోకేశ్ 317 మార్కులలో ఆలిండియా 10వ ర్యాంకును కైవసం చేసుకున్నాడు. అనిరుధ్‌రెడ్డి ఆలిండియా 20, కే రసజ్ఞ హైదరాబాద్ జోన్ మహిళా టాపర్‌తోపాటు, ఆలిండియా 78వ ర్యాంకును సొంతం చేసుకున్నారు. అలాగే టాప్-100 ర్యాంకర్లలో 31మంది బాంబే జోన్‌కు, 31మంది ఢిల్లీ జోన్‌కు, 23మంది ఐఐటీ హైదరాబాద్ జోన్‌కు, నలుగురు ఐఐటీ కాన్పూరు జోన్‌కు, ఐదుగురు ఖరగ్‌పూర్ జోన్‌కు, ఆరుగురు రూర్కీ జోన్‌కు చెందిన వారు ఉన్నారు.

### హైదరాబాద్ జోన్ నుంచి అత్యధికంగా..

ఈసారి జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 1.87లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, 1.80లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 54,378 మంది క్వాలిఫై అయ్యారు. క్వాలిఫై అయిన వారిలో 44వేల మంది అబ్బాయిలు ఉండగా, అమ్మాయిలు కేవలం 9,404 మంది మాత్రమే ఉన్నారు. అయితే ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి రికార్డుస్థాయిలో విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. మొత్తం ఏడు జోన్లు ఉండగా, హైదరాబాద్ జోన్ నుంచి ఈసారి రికార్డుస్థాయిలో 12,946 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఐఐటీ హైదరాబాద్ జోన్ పరిధిలో తెలంగాణ, ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలున్నాయి. కాగా, అడ్వాన్స్‌డ్‌లో టాప్-10, టాప్-100లోనూ తెలంగాణ విద్యార్థులు సత్తాచాటారు. ఐఐటీ హైదరాబాద్ జోన్ నుంచి టాప్10లో ఇద్దరు, టాప్100లో 23మంది, టాప్200లో 57మంది విద్యార్థులు ఉండటం విశేషం. టాప్ 300లో 78 మంది, టాప్ 400లో 116, టాప్ 500లో 136 ఐఐటీ హైదరాబాద్ జోన్ విద్యార్థులున్నారు.

**హైదరాబాద్ జోన్ నుంచి టాపర్లు**

| పేరు | ఆలిండియా ర్యాంకు |
|---|---|
| అర్నవ్ సింగ్ | 09 |
| వడ్లమూడి లోకేశ్ | 10 |
| డీ జ్ఞాన రుత్విక్ సాయి | 18 |
| వంగాల అజయ్‌రెడ్డి | 19 |
| ఏ అనిరుధ్‌రెడ్డి | 20 |
| కే రసజ | 78 |

**జోన్ క్వాలిఫై అయినవారు**

| జోన్ | క్వాలిఫై |
|---|---|
| ఐఐటీ హైదరాబాద్ | 12,946 |
| ఐఐటీ ఢిల్లీ | 11,370 |
| ఐఐటీ బాంబే | 11,226 |
| ఐఐటీ రూర్కీ | 5,454 |
| ఐఐటీ ఖరగ్‌పూర్ | 5,353 |
| ఐఐటీ కాన్పూర్ | 5,295 |
| ఐఐటీ గుహవాటి | 2,743 |

### గురుకుల విద్యార్థుల ప్రతిభ

జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ఎస్సీ, బీసీ గురుకుల విద్యార్థులు ప్రతిభకనబర్చారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) నుంచి 97మంది విద్యార్థులు ఐఐటీకి అర్హత సాధించారు. సొసైటీ నుంచి 492మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 97 మంది డైరెక్ట్ ర్యాంకులు, మరో 132మంది విద్యార్థులు ప్రిపరేటరీ ర్యాంకులకు సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూసి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపకులను బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సొసైటీ సెక్రటరీలు బడుగు సైదులు, అలుగు వర్షిణి, జాయింట్ సెక్రటరీ తిరుపతి ప్రత్యేకంగా అభినందించారు.

### ఈసారి నిరాశ..!

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఈసారి తెలంగాణకు నిరాశజనకమైన ఫలితాలొచ్చాయి. ఈఏడాది టాప్ -5లో ఒక్కరు మన విద్యార్థులు లేకపోవడం గమనార్హం. జేఈఈ మెయిన్‌లో 300లకు మూడు వందల మార్కులు సాధించిన వారు అడ్వాన్స్‌డ్‌లో మాత్రం వెనుకబడ్డారు. వాస్తవానికి కొంతకాలంగా మన విద్యార్థులు టాప్ ర్యాంకులను సాధిస్తూ వస్తున్నారు. నిరుడు 2024లో సందేశ్ ఆలిండియా మూడో ర్యాంకును సొంతం చేసుకోగా, 2023లో వావిలాల చిద్విలాస్‌రెడ్డి మొదటి ర్యాంకు, 2022లో పోలు లక్ష్మీసాయి లోహిత్‌రెడ్డి ఆలిండియా రెండో ర్యాంకులతో సత్తాచాటారు.

### ఐఐటీల్లో 17వేలకు పైగా సీట్లు..

ఐఐటీలు, ఎన్ఐటీల్లోని సీట్ల భర్తీకి నిర్వహించే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభంకానున్నది. మొత్తం ఆరు విడుతల్లో సీట్లను భర్తీచేస్తారు. మంగళవారం నుంచే మొదటి విడుత ఆప్షన్లు ఎంచుకోవచ్చు. ఈనెల 14న మొదటి మొదటి రౌండ్, 21న రెండో రౌండ్, 28న మూడో రౌండ్, జూలై 4న నాలుగో రౌండ్, జూలై 10న ఐదో రౌండ్, జూలై 16న ఫైనల్ రౌండ్ సీట్లను కేటాయిస్తారు. ఈసారి ఐఐటీల్లో 17,740 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఎన్ఐటీల్లో 24,229, ట్రిపుల్ ఐటీల్లో 8,546, గవర్నమెంట్ ఫండెండ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో 9,402 చొప్పున సీట్లున్నాయి.

## కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థికి 8వ ర్యాంకు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ పూర్వ విద్యార్థి కే రసజ్ఞ 8వ ర్యాంకు సాధించినట్టు కేకేఆర్ గౌతమ్ విద్యాసంస్థ ప్రకటించింది. టాప్-100లో 13 ర్యాంకులు కేకేఆర్ గౌతమ్ పూర్వ విద్యార్థులకు లభించాయని పేర్కొంటూ.. ఆ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపింది.

## అకారణంగా తొలగించి వీధిపాలు చేశారు

- ఎస్సీ గురుకుల సొసైటీ పార్ట్‌టైమ్ టీచర్ల ఆవేదన
- సొసైటీ కార్యదర్శి వర్షిణిపై హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ఎస్సీ గురుకుల సొసైటీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న తమను అకారణంగా విధుల నుంచి తొలగించి, కొత్తవారిని నియమించుకుంటున్నారని పార్ట్‌టైమ్ టీచర్లు మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)కి ఫిర్యాదు చేశారు. దాదాపు పదేండ్ల నుంచి ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో టీజీటీ, పీజీటీ, జేఎల్, డీఎల్, లైబ్రేరియన్, పీఈటీలుగా పనిచేస్తూ సొసైటీ ఉత్తమ ఫలితాలను సాధించడంలో కృషిచేసిన తమకు న్యాయం చేయాలని కోరారు. బీసీ, ఎస్టీ, మైనార్టీ, జనరల్ గురుకుల సొసైటీల్లో ఎక్కడా లేనివిధంగా ఎస్సీ సొసైటీలోనే పార్ట్‌టైమ్ టీచర్లను అకారణంగా తొలగించారని వాపోయారు. సొసైటీ కార్యదర్శి అలుగు వర్షిణిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మాజిద్‌హుస్సేన్ | పార్థ మందర్ | అక్షత్ | సాహిల్‌డియో | లోకేశ్


## టాప్-10లో ఐదు ర్యాంకులు

### జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'నారాయణ' హవా

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు మరోసారి టాప్ ర్యాంకులు కైవసం సత్తాచాటారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్లు పీ సింధూర నారాయణ, పీ శరణి నారాయణ తెలిపారు. టాప్-10లో ఐదు ర్యాంకులు సొంతం చేసుకున్నట్టు వెల్లడించారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో మాజిద్ హుస్సేన్ 3వ ర్యాంకు (హాల్‌టికెట్ నంబర్ 251134112), పార్థ మందర్ వార్థక్ 4వ ర్యాంకు (హెచ్‌టీ నం. 251110752), అక్షత్ చౌరాసియా 6వ ర్యాంకు (హెచ్‌టీ నం.254065055), సాహిల్ డియో 7వ ర్యాంకు (హెచ్‌టీ నం.251113172), వడ్లమూడి లోకేశ్ 10వ ర్యాంకు (హెచ్‌టీ నం.256061276) సాధించినట్టు వివరించారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీ టాప్-50లో 23 ర్యాంకులు, టాప్-100లో 43 ర్యాంకులను కైవసం చేసుకొని 'నారాయణ' విద్యార్థులు విజయభేరి మోగించారని పేర్కొంటూ.. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 'శ్రీచైతన్య' విజయభేరి

### ఓపెన్ క్యాటగిరీ టాప్-10లో మూడు ర్యాంకులు



రుత్విక్‌సాయి | హుస్సేన్ | ఉజ్వల్ | అక్షత్‌కుమార్
అర్ణవ్‌నిగమ్ | దేవదత్తా | రుత్విక్‌సాయి | అజయ్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో తమ విద్యార్థులు మరోసారి అధిపత్యం కనబర్చినట్టు శ్రీచైతన్య విద్యాసంస్థల సీఈవో, అడకమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో పాటు ఓపెన్ క్యాటగిరీలో 3, 5, 6, 11 ర్యాంకులు కైవసం చేసుకున్నట్టు వెల్లడించారు. వంగాల అజయ్‌రెడ్డి 300లకు 300 మార్కులతో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించినట్టు తెలిపారు. ఓబీసీ క్యాటగిరీలో డీజీ రుత్విక్‌సాయి ఆలిండియా ఫస్ట్ ర్యాంకు, ఓపెన్ క్యాటగిరీలో మాజిద్ హుస్సేన్ 3, ఉజ్వల్ కేసరి 5, అక్షత్ కుమార్ 6, అర్నవ్ నిగమ్ 11, దేవ్‌దత్తా మాఝీ 16, రుత్విక్ సాయి 18 కైవసం చేసుకున్నట్టు వివరించారు.

## జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'ఆల్ఫోర్స్' అద్భుత విజయం

### అజ్మీరా పురుషోత్తం నాయక్‌కు 166వ ర్యాంకు

కరీంనగర్ కార్పొరేషన్, జూన్: జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ఆల్ఫోర్స్ విద్యార్థులు జాతీయస్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించారని ఆ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వెలువడిన ఈ ఫలితాల్లో ప్రతిభ చూపిన ఆల్ఫోర్స్ విద్యార్థులను కరీంనగర్‌లోని వావిలాలపల్లి కళాశాల ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యార్థులు అజ్మీరా పురుషోత్తం నాయక్ 166వ ర్యాంకు, పీఎన్ సాయిధ్రువ 557, ఎన్ అనిరుధ్‌సాయి 657, బీ ఆదిత్య 945, బీ విష్ణు 1,203, ఎం అక్షిత 1,224, వీ హృషికేశ్ 1,329, ఆర్ గోవర్ధన్ 1,506, జే వామిక 1,604, బీ చైత్రవ్ రాజు 1,640, ఈ శశిలాల్ 1,899, కే వీరేంద్రప్రసాద్ 2,120, డీ కార్తీక్‌రెడ్డి 2,150, ఎస్ విఘ్నేశ్ 2,293, డీ అభిరామ్ 2,349, ఏ శశిప్రీతమ్ 2,463, ఈ అంకిత్‌సాయి 2,613, మహ్మద్ అబ్దుల్‌హక్ 2,766, డీ విశాల్ 2,917 ర్యాంకులు సాధించారని వివరించారు. నలుగురు 1,000లోపు ర్యాంకులను, సాధించినట్టు తెలిపారు.



జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో ప్రతిభ చూపించిన విద్యార్థులను అభినందిస్తున్న ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి

## అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'రెసోనెన్స్' సత్తా

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన 'రెసోనెన్స్' విద్యార్థి పల్లా శివ సంకేత్‌రెడ్డి జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో చరిత్ర సృష్టించాడని, ఎలాంటి ఐఐటీ ఫౌండేషన్ లేకుండానే 102 ర్యాంకు సాధించి సత్తా చాటుకున్నాడని ఆ సంస్థల డైరెక్టర్ ఎన్ పూర్ణచంద్రరావు వెల్లడించారు. రెసోనెన్స్ ఇచ్చిన శిక్షణతోనే ఈ అద్భుత విజయం సాధ్యమైందని తెలిపారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ టాప్-1000లో హైదరాబాద్ 'రెసోనెన్స్' విద్యార్థులు 21 ర్యాంకులు సాధించినట్టు చెప్పారు.



## ఎస్ఆర్ విద్యాసంస్థల ప్రభంజనం

### జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో రవిచంద్రారెడ్డికి 8వ ర్యాంకు



రవిచంద్రారెడ్డి | నాగసిద్ధార్థ | పీ సాక్షి
ఏ అనుశ్రీ | బీ సాయి | భరణిశంకర్


హనుమకొండ చౌరస్తా, జూన్ 2: జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 ఫలితాల్లో తమ విద్యార్థులు అద్భుత విజయాలు సాధించారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి తెలిపారు. ఎం రవిచంద్రారెడ్డి 8వ ర్యాంకు, వీ నాగసిద్ధార్థ 13,, పీ సాక్షి 40, ఏ అనుశ్రీ 47, బీ సాయి 68, వీ భరణీశంకర్ 90, జీ రాజేశ్ 106, బీ వినోద్ 115, ఎం వెంకట కౌశిక్ 123, ఎస్ పవన్ 204, ఏ సంతోష్ 265, బీ వాగ్దేవి 269వ ర్యాంకు సాధించి జాతీయస్థాయిలో ఎస్ఆర్ కీర్తి ప్రతిష్టలను నిలబెట్టారని వివరించారు. తమ సంస్థల్లో విద్యనభ్యసించినవారు దేశ, విదేశాల్లో ఉన్నతమైన, పదవుల్లో ఉన్నారని చెప్పారు.

## టాపర్ల చూపు.. ఐఐటీ ముంబై వైపు..!

### 23 ఐఐటీలుండగా.. ముంబై ఐఐటీవైపే ర్యాంకర్ల మొగ్గు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ టాపర్లల్లో అత్యధికులు ముంబై ఐఐటీ వైపు చూస్తున్నారు. మరీ ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్అండ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరుతున్నారు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదలైన సందర్భంగా పలువురు ర్యాంకర్లను కదిలిస్తే సాఫ్ట్‌వేర్ రంగమే మా గమ్యస్థానమని తేల్చి చెప్తున్నారు. జాతీయంగా 23 ఐఐటీలున్నాయి. కానీ అత్యధికులు ఐఐటీ ముంబై , సీఎస్ఈ కోర్సుల్లోనే చేరటానికి ఇష్టపడుతున్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరి స్టార్టప్స్‌గా.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా రాణిస్తామని స్పష్టం చేస్తున్నారు. వారిలో పలువురి మనోగతం ఇలా ఉంది.

### సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతా



మా తల్లిదండ్రులు ఇది చేయమని.. అది చేయమని నాపై ఒత్తిడి తేలేదు. నాదారి నాదే. చిన్నప్పటి నుంచి ఇష్టపడి చదివా. 10వ తరగతి మధ్యలోనే జేఈఈ ప్రిపరేషన్ ప్రారంభించా. రెండున్నరేండ్లు జేఈఈ కోసం శ్రమించా. జేఈఈ మెయిన్స్‌ను నాలెడ్జ్‌ను పరీక్షించుకునేందుకే ఉపయోగించుకున్నా. మెయిన్‌లో 200లోపు ర్యాంకర్లందర్ని ఒకే గాటన కట్టొచ్చు. దాదాపు అందరిలోను ఒకే సామర్థ్యాలుంటాయి. నా ఫోకస్ అంతా అడ్వాన్స్‌డ్‌పైనే పెట్టా. - అర్నవ్‌సింగ్

### సివిల్స్ రాస్తా.. ఐఏఎస్ కొడుతా



రోజుకు 10గంటలు కష్టపడ్డా. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు రావడం సంతోషాన్నిచ్చింది. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ (సీఎస్ఈ) కోర్సుల్లో చేరుతా. బీటెక్ పూర్తయ్యాక సివిల్స్ రాసి.. ఐఏఎస్ కొడతా.
–డీ జ్ఞాన రుత్విక్ సాయి

### రోజుకు 14గంటలు కష్టపడ్డా



జేఈఈ అడ్వాన్స్‌డ్ కోసం రోజుకు 14గంటలు కష్టపడ్డా. ఫిజిక్స్ కొంచెం కఠినంగా అనిపించింది. గణితం, కెమిస్ట్రీ సబ్జెక్టులపై పట్టుసాధించా. 78వ ర్యాంకు రావడం సంతోషానిచ్చింది. ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరుతా. - రసజ్ఞ

## నవోదయ..ఈసారి అడ్మిషన్ లేదయా!

- నవోదయ స్కూళ్లిచ్చారు.. అడ్మిషన్లు మరిచారు
- కాగితాల్లోనే కొత్త విద్యాలయాల ఏర్పాటు
- క్యాబినెట్ ఆమోదం పొందినా కదలని ఫైలు
- 7 విద్యాలయాల ఏర్పాటులో కేంద్రం నిర్లక్ష్యం



హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి కొత్తగా నవోదయ విద్యాలయాలను ఇచ్చినట్టే ఇచ్చి.. కేంద్రం చేయిచ్చింది. ఆ నవోదయ విద్యాలయాలను ప్రారంభించే విషయంలో ఊసూరుమనిపించింది. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఆయా విద్యాలయాల్లో అడ్మిషన్లు చేపట్టనే లేదు. దీంతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర నష్టం కలగనున్నది. రాష్ట్రానికి కొత్తగా 7 నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర మంత్రివర్గం 2024 డిసెంబర్ 6న ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో జగిత్యాల, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్-మల్కాజిగిరి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో విద్యాలయాల ఏర్పాటుకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఈ ఏడింటిలో అడ్మిషన్లు కల్పిస్తారని అంతా భావించారు. కానీ విద్యాలయాల మంజూరు అంశం కేవలం కాగితాలకే పరిమితమైంది. క్యాబినెట్ ఆమోదం పొందినా 2024 డిసెంబర్ నుంచి వీటి స్థాపనకు ఒక్క అడుగు ముందుకు పడనే లేదు. రాష్ట్రంలో ప్రస్తుతం 9 నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. వీటిల్లోనే అడ్మిషన్లు కల్పిస్తామని జవహర్ నవోదయ విద్యాలయ సమితి (జేఎన్‌వీ) తాజాగా ప్రకటన విడుదల చేసింది. కొత్తగా మంజూరైన ఏడు విద్యాలయాల్లో ఇప్పట్లో అడ్మిషన్లు లేనట్టేనని చెప్పేసింది. 2026-27 విద్యా సంవత్సరానికి గాను జవహర్ నవోదయ విద్యాలయాలలో ప్రవేశాలకు ఇటీవలే జేఎన్‌వీ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. జూలై 29 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మొదటి విడత పరీక్షను 2025 డిసెంబర్ 13న, రెండో విడత పరీక్షను 2026 ఏప్రిల్ 11న నిర్వహిస్తారు. తెలంగాణ విద్యార్థులకు మొదటి విడతలోనే పరీక్ష జరగనున్నది. 2026 మార్చిలో ఫలితాలను విడుదల చేస్తారు. ఈ జాబితాలో కేవలం 9 పాత నవోదయ విద్యాలయాలే ఉన్నాయి.

### 560 సీట్లు లాస్

జవహర్ నవోదయ అడ్మిషన్ పొందేందుకు విద్యాలయం ఉన్న జిల్లాలోని విద్యార్థులే అర్హులు. 80 సీట్లుంటే 60 (75శాతం) సీట్లను ఆయా జిల్లాలోని విద్యార్థులకే కేటాయిస్తారు. స్థానికులైన విద్యార్థులే అర్హులు. అది కూడా గ్రామీణ ప్రాంత విద్యార్థులకే ఎక్కువ సీట్లు కేటాయిస్తారు. పట్టణ ప్రాంత విద్యార్థులకు సైతం సీట్లు కేటాయిస్తారు. తాజాగా విడుదలైన అడ్మిషన్ నోటిఫికేషన్‌లో కొత్తగా ఆమోదించిన ఏడు నవోదయ విద్యాలయాలను చేర్చలేదు. దీంతో ఆ ఏడు జిల్లాల విద్యార్థులు 560 సీట్లు కోల్పోయినట్టే.

### కొత్త నవోదయాల కోసం పోరాటం

కొత్త నవోదయ విద్యాలయాల మంజూరుపై తొలుత అంతా హర్షించాం. కానీ ఇప్పుడవి కేవలం కాగితాలపైనే ఉన్నాయి. అడ్మిషన్ నోటిఫికేషన్‌లో కొత్తవాటిని చేర్చకపోవడం వివక్షాపూరితం. అధికారికంగా విద్యాలయాలను ప్రారంభించి, తాత్కాలిక భవనాల్లోనైనా తరగతులు ప్రారంభించి అడ్మిషన్లు తీసుకోవాలన్నదే మా డిమాండ్. కొత్త నవోదయ విద్యాలయాలు ప్రారంభించే వరకు తల్లిదండ్రులను ఏకం చేసి పోరాడుతాం.

–కల్యాణి, క్రాంతి కీన్ ఫౌండేషన్

### తెలంగాణపై కేంద్రం సవతితల్లి ప్రేమ

కొత్త విద్యాలయాల (జేఎన్‌వీ) స్థాపన విషయంలో కేంద్రం నిర్లక్ష్యం కొట్టచ్చినట్టు కనిపిస్తున్నది. ముఖ్యంగా క్యాబినెట్ ఆమోదం తర్వాత కూడా కొత్త విద్యాలయాలు ఏర్పాటు చేయకపోవడం తెలంగాణపై సవతి తల్లి ప్రేమను చూపడమే. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, ఎంపీలు ఈ విషయంలో నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. జేఎన్‌వీల స్థాపనకు ఆమోదం వచ్చిన వెంటనే విద్యాసంస్థల నిర్మాణం, అధ్యాపకుల నియామకం వంటి ప్రాథమిక ఏర్పాట్లు చేపట్టాల్సి ఉంటుంది. భారీగా నిధులను మంజూరు చేయించుకోవాలి. కానీ ఎలాంటి ప్రయత్నాలు చేసిన దాఖలాల్లేవు. ఇప్పటికైనా కేంద్రమంత్రులు, ఎంపీలు స్పందించి, చొరవ తీసుకుని ఆయా జిల్లాల్లో విద్యార్థులకు తక్షణమే ప్రవేశ అవకాశం కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. కేంద్రం, నవోదయ విద్యాసమితి స్పందించి, కొత్తగా ఆమోదించిన నవోదయ విద్యాలయాలను తక్షణం ప్రవేశ ప్రక్రియలో చేర్చాలని విద్యావేత్తలు, తల్లిదండ్రులు కోరుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రానంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరిస్తున్నారు.

## గ్రేడింగా.. మార్కులా?

- ఎన్ని పరీక్షలు.. ఎన్ని మార్కులు?
- పాఠశాల విద్యపై వీడని సందిగ్ధత
- 'ఇంటర్నల్స్' అయోమయం
- ప్రభుత్వంపై విద్యావేత్తల ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పాఠశాల విద్యావిధానంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు ఎన్ని పరీక్షలుంటాయి? ఎన్ని మార్కులకు పరీక్షలు నిర్వహిస్తారు? అనే అంశాలపై స్పష్టత కొరవడిందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నిరంతర సమగ్ర మూల్యాంకనం, గ్రేడింగ్ విధానం ఉన్నట్లా... లేనట్లా అనేది ప్రభుత్వం వెల్లడించలేదు. పాఠశాలవిద్యకు మార్గదర్శకంగా నిలిచే అకడమిక్ క్యాలెండర్‌ను ఎస్సీఈఆర్టీ విడుదల చేయలేదు. రానున్న విద్యాసంవత్సరంలో సర్కారు విధానమేంటో తెలియక ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అయోమయం నెలకొన్నది. ఈ నెల 12 నుంచి కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంకానుందని, ఇంకెప్పుడు స్పష్టతనిస్తారని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

### పూటకో విధానం.. ఇప్పుండేంటో!

నిరుడు 2024 -25 విద్యాసంవత్సరంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ) విధానంలో నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్లు (ఎఫ్‌ఏ), రెండు సమ్మేటివ్ అసెస్‌మెంట్లు(ఎస్‌ఏ) నిర్వహించారు. జూలై, సెప్టెంబర్, డిసెంబర్, జనవరి నెలల్లో ఎఫ్‌ఏ, అక్టోబర్, ఏప్రిల్లో మాసాల్లో ఎస్‌ఏ పరీక్షలను పెట్టారు. తొలుత గ్రేడింగ్‌ను, ఇంటర్నల్స్ రద్దుచేశారు. ఈ నిర్ణయం వివాదాస్పదం కావడంతో మొదట గ్రేడింగ్‌ను రద్దుచేసి, ఒక్క ఏడాది ఇంటర్నల్స్‌ను పునరుద్దరించారు. పదో తరగతి పరీక్షలు జరిగిన తర్వాత గ్రేడింగ్‌ను పునరుద్ధరించారు. నిరంతర సమగ్ర మూల్యాంకనం రద్దుచేసినట్టు అధికారులు చెప్తున్నారు. కానీ అధికారికంగా ఉత్తర్వులేమీ ఇవ్వలేదు. దీంతో మొత్తం పాఠశాల విద్యావిధానంపై అయోమయం నెలకొన్నది.

## గ్రామగ్రామానికి 'నాణ్యమైన విత్తనం'

### భద్రాది-కొత్తగూడెంలో ప్రారంభించిన మంత్రి తుమ్మల

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయవర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం గ్రామగ్రామానికి 'నాణ్యమైన విత్తనం' కార్యక్రమాన్ని భద్రాద్రి-కొత్తగూడెంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. అలాగే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, ఆయా జిల్లాల కలెక్టర్ల సమక్షంలో సుమారు 300మంది అభ్యుదయ రైతులకు విత్తన కిట్లను పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లాలో సీఎం సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి, వ్యవసాయవర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. భువనగిరిలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వికారాబాద్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ రైతులకు విత్తన ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే వరంగల్, కరీంనగర్, సంగారెడ్డి, హనుమకొండ, ములుగు, మహబూబ్‌నగర్, సిద్దిపేట, నల్లగొండలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, కొండాసురేఖ, సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విత్తన ప్యాకెట్లను అందజేశారు.

## మంత్రి దామోదరను కలిసిన టీజీజీడీఏ బృందం

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన జహీరాబాద్ దవాఖానలో సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో చికిత్స అంశానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్‌తో కలిసి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా సస్పెండ్ అయిన వైద్యుడి అంశంపై వాస్తవాలను మంత్రికి వివరించినట్టు వారు తెలిపారు. తాము వివరించిన అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించి.. సస్పెన్షన్ ఉపసంహరించుకునేందుకు అంగీకరించినట్టు వెల్లడించారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, కోశాధికారి ఎంకే రౌఫ్, సీఈసీ సభ్యుడు డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఎన్డీపీఎల్‌ను జల్లెడ పడుతాం

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): నేటినుంచి వారం రోజులపాటు నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్)పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానావాజ్ ఖాసీం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా బస్సులు, రైళ్లు, విమానాల నుంచి వస్తున్న నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై నిరంతర నిఘా ఉంటుందని చెప్పారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు, అన్ని జిల్లాల్లో అసిస్టెంట్ కమిషనర్ల వద్ద పనిచేసే ఎన్‌ఫోర్స్ టీమ్‌లు, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్‌లతోపాటు, ఎక్సైజ్ సీఐలు, సిబ్బంది ఎన్డీపీఎల్‌ను జల్లెడ పట్టాలని ఆదేశించారు. ఢిల్లీ, గోవా, కర్ణాటక, హర్యానాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి తెలంగాణకు వచ్చే మద్యంపై ప్రత్యేక నిఘా పెట్టామని, అక్రమార్కులను పట్టుకుంటామని ఆయన తెలిపారు.

## ములుగు ఘటనపై రైతు కమిషన్ ఆగ్రహం

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ములుగు జిల్లాలో విత్తనోత్పత్తి బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంపై రైతు కమిషన్ చైర్మన్ ఏ కోదండరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. సోమవారం రైతు కమిషన్ కార్యాలయం నుంచి ములుగు ఘటనపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ములుగు జిల్లాలో విత్తనోత్పత్తి ఘటన పురోగతిపై సమీక్షించారు. ములుగులో మల్టీనేషనల్ కంపెనీలకు చెందిన విత్తనాలను వినియోగించి నష్టపోయిన ములుగు బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు.

## ఏసీబీ డీజీకి పీఎస్ఎం మెడల్

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన వేడుకల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీ విజయ్‌కుమార్‌కు ప్రెసిడెంట్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ (పీఎస్ఎం)ను సీఎం రేవంత్‌రెడ్డి బహూకరించారు. సంగారెడ్డి ఎస్పీ ఎం రమణకుమార్‌కు పీఎస్ఎంను సీఎం బహూకరించారు. వీరితో పాటు మరో 10 మందికి మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీసెస్ (ఎంఎస్ఎం), 19 మందికి గ్యాలంట్రీ మెడల్స్‌ను ప్రదానం చేశారు. కే రామకృష్ణ, బండి వెంకటేశ్వరరెడ్డి, ఆత్మకూరి వెంకటేశ్వర్లు, అరవేటి భానుప్రసాద్ రావు, అజ్జెళ్ల శ్రీనివాసరావు, ఎస్ వెంకటేశ్వర్లు, మహంకాళి మధు, కక్కెర్ల శ్రీనివాస్, ఏ సత్యనారాయణ, రాసమోని వెంకటేశ్వర్లు ఎంఎస్ఎం మెడల్స్ పొందారు.